ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (రేలంగిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 8-12-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

మనం గుడికి వెళ్ళినప్పుడు గుడిలో ఉన్న దేవతలకు నమస్కారం పెడతాము. ఆ దేవతలుకూడా మనలో కొందరికి నమస్కారం పెడతారు. ఎవరి హృదయంలో దయ ఉందో, ఎవరి అంతఃకరణం దయాపూరితమైనదో వారికి మరల ఇటువంటి జీవుడిని ఎప్పుడు చూస్తామా అని దేవతలు నమస్కారం పెడతారు. మీ గ్రామంలో సత్పురుషులు ఉంటే వారితో సహవాసం చెయ్యి, లేకపోతే కాశీ వెళ్ళి చనిపోయేదాకా అక్కడే ఉండు అని ఆచార్యులవారు చెప్పారు. స్వంతబుద్ధిని, సత్పురుషులతో సహవాసమును మీ ప్రాణముతో సమానముగా కాపాడుకోండి అన్నారు ఆచార్యులవారు. మీకు వానప్రస్థం వచ్చిన తరువాత ఎవరి బాధ్యతలు వారికి ఇచ్చాక మీరు ఏ గ్రామంలో ఉన్నా మీ మనస్సులో హెచ్చుతగ్గులు లేకుండా చూసుకొంటే మీరు కాశీలో ఉన్నట్లే అని భగవాన్ చెప్పారు. పూర్వం పెద్దలు ఏమి చెప్పారు అంటే పుణ్యక్షేత్రాలు తిరగటానికి తగిన డబ్బు లేకపోతే మనస్సులో ఈ నాలుగు మాటలు అనుకోండి అని చెప్పారు. అవి ఏమిటి అంటే గీతా, గంగా, గోవిందా, గాయిత్రీ. మనస్సులో ఈ మాటలను స్మరించటం వలన మీ మనస్సు కుదురుపడుతుంది. పుణ్యక్షేత్రాలు తిరిగినంత పుణ్యం మీకు వస్తుంది అని చెప్పారు. మీరు ఏదైనా అధ్యయనం చేసేటప్పుడు జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. అర్థం చేసుకొని మీరు ఎంత వరకు ఆచరించ గలిగితే అంతవరకు ఆచరించాలి. అంతే కాకుండా దానిని ఇతరులకు అర్థమయ్యేలాగ చెపితే సరస్వతీ దేవి యొక్క అనుగ్రహాన్ని పొందుతారు. ఇతరుల యొక్క క్షేమంకోరి మాట్లాడుతూ ఉంటే, ఇతరుల క్షేమంకోరి పనిచేస్తూ ఉంటే జీవకోటి మిమ్మల్ని ప్రేమిస్తుంది. మీ ఇంటి నిండా డబ్బు ఉన్నా, మీ తలకాయ నిండా చదువు ఉన్నా మిమ్మల్ని ఎవరూ ప్రేమించరు, ఇతరుల హితవుకోరి పనిచేస్తూ ఉంటే వారి ప్రేమకు పాత్రుడవుతావు, రెండో లాభం ఏమిటి అంటే ఈశ్వరానుగ్రహం మీకు వస్తుంది.

ఈ శరీరం నిజం అనుకొంటున్నాము. ఇది మాయ శరీరము. ఇక్కడ కొన్నాళ్ళు తిరుగుతుంది తరువాత రాలిపోతుంది. ఈ మాయ శరీరాలకు ఒక అధిపతి ఉన్నాడు. వాడినే మనం భగవంతుడు అని పిలుస్తాము. ఆయన మన హృదయంలోనే ఉన్నాడు. ఆయన ఏమీ మాట్లాడడు. మనం మంచిచేసినా, చెడ్డ చేసినా ఏమీ అనడు అలాచూస్తూ ఉంటాడు. ఆయనను తెలుసుకోవటానికి మనం ప్రయత్నం చేస్తాము ఆప్రయత్నాన్ని కూడా ఆయన చూస్తూ ఉంటాడు. నన్ను తెలుసుకో అని ఆయన చెప్పడు. ఆయనను తెలుసుకోవటానికి నీవు చేసే ప్రయత్నాన్ని చూసి నాకోసం ప్రయత్నం చేస్తున్నాడు అని రాబోయే జన్మలో ఆప్రయత్నం అభివృద్ధి అయ్యే కుటుంబంలో శరీరం ఇస్తాడు. ఆది

ఆయన చేసేపని. భగవంతుని నిరంతరము స్మరించుకోవాలి. భగవంతుని జ్ఞాపకం పెట్టుకొన్న టైములో మనం మంచి చేస్తాము. ఆ జ్ఞాపకం వదిలివేసాము అనుకోండి ఆ వదిలిన టైములో మనం చెడ్డ చేస్తాము. ఈ శరీరము, లోకము, జీవుడు అంతా మాయ అని కబుర్లు చెప్పకొంటూ ఉంటే మనం మాయలో నుండి బయటకు రాలేము సరికదా మాయ పెరిగిపోతుంది. నీ హృదయంలో ఆత్మఉంది. దానిని ఆశ్రయిస్తే, నీవు ఆత్మగా ఉండిపోతే మాయ నిన్ను విడిచిపెట్టి పత్తాలేకుండా పోతుంది. ఈశ్వరుడిని చింతించకుండా, ధ్యానం చేయకుండా జీవలక్షణాలు నుండి బయటకు రాలేము. ఈశ్వరుడిని నిరంతరము చింతించాలి. ఆయన పట్ల ప్రేమకలిగి ఉండాలి. మన లోపల జీవితము, బయట జీవితము వేరుగా ఉంటుంది. గుడిలో కూర్చొని గంటలుకొడితే, పూజలు చేస్తే జ్ఞానం వచ్చి వేయదు. నీ లోపల జీవితం, బయట జీవితం ఐక్యం కావాలి.

గాఢనిద్రలో మీరు దేహంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి, విషయాలతోటి అన్నింటితోటి విడిపోతున్నారు. కాని మీరు ఉన్నారు. గాఢనిద్రలో మీరు అన్నింటితోటి ఎలా విడిపోతున్నారో జాగ్రదావస్థలో సాధన చేసి, గురువును ఆశ్రయించి అన్నింటితోటి విడిపోతే అది నీకడసారి జన్మ అన్నారు.భగవాన్ ధనం ఉన్నవారిని, ధనం లేని వారిని సమానంగా చూడాలి. ధనం ఉన్నవారిని ఎక్కువగా చూస్తున్నాము అనుకోండి మనలో ధనకాంక్ష ఉంది అని అర్థం. నీకు జ్ఞానం ఉంటే అది గర్వంలేని జ్ఞానం అయి వుండాలి. గర్వంతో కూడిన జ్ఞానం అయితే అది జ్ఞానం కాదు అది అజ్ఞానం. గర్వంతో కూడిన జ్ఞానం నిన్ను పాడు చేస్తుంది, ఇతరులను పాడు చేస్తుంది. నీవు దానం చేయవచ్చు. నీవు చేసే దానం ఇతరులకు సుఖాన్ని కలుగజేయాలి, దు:ఖాన్ని కలుగజేయకూడదు. నీవు చేసే దానం ఇతరులకు దు:ఖాన్ని కలుగజేస్తే అది దానం కాదు అది పిశాచం. ఇతరులతో మాట్లాడేటప్పడు హితువుగా మాట్లాడాలి, ప్రేమగా మాట్లాడాలి. శరీరానికి గాయం తగిలితే రెండు రోజులలో తగ్గిపోతుంది కాని మనస్సుకు గాయం తగిలితే శరీరం చనిపోయే వరకు తగ్గదు. ఏదైనా విషయం చెప్పేటప్పడు ఎదుటి వారి మనస్సుకు గాయం తగలకుండా చూసుకోవాలి.

మనం అనుకొన్న పనులు అయినప్పడు దేవుడిని పట్టుకొని ఉంటాము. మనం అనుకొన్న పనులు కానప్పడు భగవంతుని వదిలేస్తాము. అది నిజమైన భక్తి కాదు . ఒకోసారి మీరు అనుకొన్న పనులు జరగవు. మీ ఇంటిలోని వారే, మీరు ఎవరినైతే ప్రేమిస్తున్నారో వారే మీకు ఎదురు తిరుగుతారు. ఒకోసారి కష్టాలు వస్తూ ఉంటాయి. కంగారు పడకండి, అధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి తీసుకొని రావటానికి భగవంతుడే ఒకోసారి ఆ కష్టాలను పంపుతాడు. మీకు ఎంత సహనం ఉందో చూసుకోవటం కోసం, మీకు అంతర్దృష్టి కలగటం కోసం భగవంతుడే ఆ సంఘటనలు పంపిస్తున్నాడు గాని ఆయనకు తెలియకుండా అవి వస్తున్నాయి అని అనుకోవద్దు. కొన్ని సంఘటనలు జరగకపోతే మనం అధ్యాత్మికంగా అభివృద్ధి పొందలేము,. ఒకోసారి మనం ఎవరినైతే ప్రేమిస్తున్నామో వారే ఎదురు తిరుగుతారు. అప్పడు మన మనస్సులో కలతవస్తే మనకు భక్తి లేదు అని అర్థం. ఒకసారి రాముడు ఆంజనేయస్వామిని అంత పెద్దలంకాపట్టణమును ఎలాదహించావు అని అడిగితే నా శక్తివల్ల, నా తెలివివల్ల దహించాను, అని ఆంజనేయస్వామి చెప్పలేదు. నీఅనుగ్రహంవలన అని చెప్పాడు. అది

భక్తుడు లక్షణం. కొంత మంది ఉంటారు, ఎవరో చేసిన మంచి పనులనుకూడా మేమే చేసాము అని చెపుతారు. ఇంక వారికి భక్తి ఏమిటి? వారికి జ్ఞానం ఏమిటి?

నాకు నిర్వికల్ప సమాధి నేర్పరాదా అని రంగన్న భగవాన్‌ను అడిగితే నీకు నిర్వికల్ప సమాధి ఎందుకు సహజ సమాధే నేర్పుతాను అన్నారు భగవాన్. సహజ సమాధిలో ఉన్నవాడు మనతోటి తిరుగుతూ ఉంటాడు, తింటూ ఉంటాడు. లోకాన్ని చూస్తూ చూడని వాడి తోటి, లోకంలోని విషయాలను గ్రహిస్తూ గ్రహించని వాడితోటి సమానంగా ఉంటాడు. మనకు దగ్గరగా ఉంటాడు. దగ్గరగా ఉన్నాడు కాబట్టి మనతో సమానం అనుకొంటాము. కాని వాడు ఎక్కడ ఉన్నాడో మనకు తెలియదు, లోపల అంతస్థు ఎటువంటిదో మనకు తెలియదు. సహజ సమాధిలో ఉన్నవాడికి బేధ దృష్టి ఉండదు. సత్యంలో లీనమై ఉంటాడు. ఎరుకతో ఉంటాడు. బయట ఏమి జరుగుతోందో తెలుస్తూ ఉంటుంది. బయట లోకంలో పనిచేస్తూ ఉంటాడు. లోపల తన స్వరూపములో నుండి జారడు. నిర్వికల్ప సమాధిలో సత్యంలో లీనమై ఉంటాడు గాని ఎరుక ఉండదు. వాడికి దేహం, లోకం తెలియదు. లోకంలో వ్యవహరించలేడు. నిర్వికల్ప సమాధిలో ఉన్నంత సేపు బాగానే ఉంటుందిగాని మరల ఎరుకలోనికి వచ్చేటప్పటికి అహంకారము విజృంభించే అవకాశము ఉంది సవికల్ప సమాధిలో సత్యాన్ని ప్రయత్నముతో పట్టుకొని ఉంటాడు. ప్రయత్నం విడిచి పెట్టేసరికి అందులో నుండి జారిపోతాడు.

కొంత మంది సమాధి స్థితిలో ఉన్నప్పుడు బాగానే ఉంటారు. బయటకు వచ్చేటప్పటికి విజృంభిస్తారు. మనో నాశనము కాలేదు కాబట్టి అలా ఉంటారు. మనస్సు వెళ్ళి ఆత్మలో లయమయితే అది సహజ సమాధి మనస్సుదాని మూలాన్ని చూసేవరకు దానిని నమ్మటానికి వీలులేదు, ఎప్పుడయినా విజృంభించవచ్చు. మనకు ఉన్న రజోగుణాన్ని సత్వగుణంగా మార్చుకొంటే జ్ఞానం కలిగే అవకాశం ఉంటుంది. మనకు రజోగుణమేపోలేదు ఇంక సత్వ గుణం ఎప్పడు వస్తుంది, జ్ఞానం ఎప్పడు వస్తుంది. సత్వగుణం లేకుండా ఎవడికీ జ్ఞానం కలుగదు. నీవు డబ్బుని, గౌరవాన్ని, ఎలా సంపాదించుకొంటున్నావో అలాగే సత్వగుణాన్ని కూడా సంపాదించుకో. కీర్తి కూడా మనిషికి బరువే. కీర్తి ఉంటే మనిషికి విశ్రాంతి ఉండదు, సాధన చేసుకోవటానికి టైము ఉండదు. చిన్ననాటి స్నేహితుడు చాలాకాలం తరువాత కనిపిస్తే ఒక్కసారి ఆస్నేహం గుర్తుకు వచ్చి ఆప్యాయంతో వాడిని కౌగిలించుకొంటాము. అదే విధంగా మన ఇంద్రియాలు, మన మనస్సు, మన తెలివి మన అంతఃకరణములో ఉన్న ఆత్మను ఎప్పుడయితే కౌగిలించుకొన్నాయో ఆరోజు మనకు జ్ఞానం కలుగుతుంది. ఇంద్రియాలు వెళ్ళి విషయాలను, భోగాలను కౌగిలించుకొంటున్నాయి. అలాకాదు అవి మన హృదయంలో ఉన్న ఆత్మను కౌగిలించుకొంటే ఆత్మ గురించి మనకు తెలుస్తుంది. ఆత్మను తెలుసుకొనే వరకు ఎంతో కొంత ప్రయత్నం చేయవలసిందే. ప్రయత్నం చేసేటప్పడు ఎంతో కొంత బాధ ఉంటుంది. ప్రయత్నం ఎక్కడయితే ఉందో అక్కడ బంధం ఉంటుంది ప్రయత్నం చేస్తూ మనం ప్రయత్నం లేని స్థితికి వెళ్ళాలి.

నీకు ఇష్టమైన భగవంతుని నామమును తీసుకొని నిరంతరము జపించు. అది ప్రేమగా చేస్తే నీ మనస్సు నిర్మల మవుతుంది, శరీరానికి తేజస్సు వస్తుంది, లోపల బయట శుచి వస్తుంది. మంత్ర జపం వలన నీవు పరమ పవిత్రుడవు అవుతావు ప్రీతిగా టైమును మర్చిపోయి మీరు నామం చేయాలి.

చనిపోయిన తరువాత ఏమిలేదు అనుకొంటాము. మరణానంతర జీవితం ఉంది. మన అహంభావన సూక్ష్మరూపంలోనికి వెళ్ళి పోతుంది. గాఢనిద్రలో మనకు అహంభావన కనబడదు. అందువలన లేదు అని అనుకొంటాము కాని అహంభావన ఉంది. అలాగే మన దేహం చనిపోయినపుడు అది కనబడదు. కొత్త దేహం వచ్చినప్పడు మరల సిద్ధమవుతుంది. ఈశ్వర సాక్షాత్కారం అయ్యే వరకు అది నశించదు.

మీరు చేతులతో కష్టపడి పని చేయలేక పోయినా మీకు మంచి భావాలు వస్తూ ఉంటే, సహృదయం ఉంటే, మనస్సు ఉత్తమమైన తలంపులతో నిండి ఉంటే నీద్వారా లోకానికి మేలు జరుగుతుంది. తలంపుకు కూడా బలం ఉంది. ఆత్మానుభవం నీవు పొందలేకపోయినా అది పొందిన వాడి సమక్షంలో ఉన్నప్పడు ఆనందతరంగాలు, శాంతితరంగాలు వచ్చి నీమీద పని చేస్తాయి. సమాధి స్థితి కొన్ని గంటలు అనుభవించినప్పటికి వాసన అనే విత్తనం కాలకుండా ఉంటే పునర్జన్మను తీసుకొని వస్తుంది, జన్మరాకుండా ఆగదు. వాసన వేరుతో సహానశిస్తే నీకు సహజ సమాధి వస్తుంది, అందుచేత కోట్లాది మందిలో ఒకడు తరిస్తాడు అని భగవంతుడు చెప్పాడు. నీవు చేసే ప్రయత్నం, నీవు చేసే మంచి వృధాపోదు. రాబోయే జన్మలో నీకే ఇస్తాడు. భగవంతుడు నీ హృదయంలో ఉన్నాడు. నీవు చేసే ప్రయత్నం చూస్తున్నాడు. ఆయన స్వరూపాన్ని నీకు ఇచ్చే వరకు నిన్ను వదలడు. భగవంతుని ప్రేమ నిజమైన ప్రేమ ఆయన ఏమీ ఆశించడు. మనుషుల యొక్క ప్రేమ నిజమైన ప్రేమకాదు. ఒకరి స్వార్ధానికి ఇంకొకరు ఉపయోగపడుతూ ఉంటే మనుషుల యొక్క ప్రేమ నిలబడుతుంది, లేకపోతే నిలబడదు.

బాగా చదువుకొన్న వ్యక్తి ఒకడు వివేకానంద దగ్గరకు వచ్చాడు. నేను పి.జి. చదివాను అనిచెప్పాడు. తరువాత ఏమిచేస్తావు అని అడిగితే ఉద్యోగం చేస్తాను అనిచెప్పాడు. తరువాత ఏమిచేస్తావు అంటే పెళ్ళిచేసుకొంటాను అన్నాడు. తరువాత ఏమిచేస్తావు అంటే కుటుంబాన్ని పోషిస్తాను అన్నాడు. తరువాత ఏమిచేస్తావు అంటే ముసలివాడను అవుతాను అన్నాడు. తరువాత ఏమిచేస్తావు అంటే చనిపోతాను అన్నాడు. నీవు చనిపోవటానికా నీవుచదివిన చదువు అంతా. అంత కంటే నీవు సాధించవలసినది ఈ జీవితంలో ఏమీ లేదా అన్నారు. చదువవలెను, చదువవలెను చావులేనిస్థితిని పొందుటకు చదువవలెను అన్నాడు ప్రహ్లాదుడు.

**(అంతర్వేదిలో శ్రీ నాన్నగారి ప్రవచనములు జనవరి 20, 21,22. తేదీలలో జరుగును)**